ప్రజాశక్తి

బుధవారం 10 జనవరి 2024 8 పేజీలు

గుంటూరు పల్నాడు







సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావును, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నేతాజి, అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ, సిపిఎం నగర కార్యదర్శి నళినీకాంత్‌ను అరెస్ట్ చేస్తున్న పోలీసులు



నరసరావుపేట పోలీస్‌స్టేషన్‌లో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్

కార్మిక నేతలపై నిర్బంధం

అంగన్‌వాడీలకు మద్దతుగా కార్మిక సంఘాలు జైల్ భరో - అడ్డుకున్న పోలీసులు, నేతల అరెస్ట్‌లు

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

అంగన్‌వాడీలపై ఎస్మాను ఉపసంహరించుకోవాలని నిరసనగా కార్మిక, ప్రజా సంఘాలు చేపట్టిన జైల్‌బరో కార్యక్రమంపై ప్రభుత్వం నిర్బంధం ప్రయోగించింది. గుంటూరు, మంగళగిరి, పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో నాయకుల్ని పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి, పోలీసుస్టేషన్లకు తరలించారు. తొలుత గుంటూరులోని మార్కెట్ సెంటర్ సెంటర్ నుండి శంకర్‌విలాస్ సెంటర్ వరకూ వివిధ కార్మిక, సంఘాల నాయకులు మంగళవారం నిరసన ప్రదర్శన చేశాయి. అప్పటికే శంకర్ విలాస్ సెంటర్‌లో పోలీసులు భారీగా మోహరించటంతో నాయకులు శంకర్ విలాస్ బ్రిడ్జి వద్ద రాస్తోరోకో చేపట్టారు. కొద్దిసేపు వాహాలను అడ్డుకున్నారు. దీంతో పలీసులు నాయకుల్ని బలవంతంగా వాహనాల్లోకి ఎక్కించి, అరండల్‌పేట పోలీసు స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు పాశం రామారావు, జంగాల అజయ్‌కుమార్, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దండా లక్ష్మీనారాయణ, వై.నేతాజి, సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, ఎఐటియుసి రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి.రాధాకృష్ణమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఇ.అప్పారావు, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు యు.గనిరాజు, ఐఎఫ్‌టియు (న్యూ) నాయకులు యు.నాగేశ్వరరావు, సిఐటియు నగర తూర్పు ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, నాయకులు శివాజీ, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఎ.చిస్టీ, ఐద్వా నగర కార్యదర్శి ఎ.కళ్యాణి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ తదితరులున్నారు. సాయంత్రం 3 గంటల తర్వాత వీరిని విడుదల చేశారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల పట్ల ప్రభుత్వం నియంతలా ▶ 2లో



గుంటూరులో రాస్తారోకో చేస్తున్న నాయకులు



పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో రాస్తారోకో చేస్తున్న వివిధ పార్టీలు, సంఘాల నాయకులు

మిర్చి యార్డు కిటకిట

భారీగా తరలివచ్చిన టిక్కీలు - కొనసాగుతున్న ధరల పతనం

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

గుంటూరు మిర్చి యార్డుకు మంగళవారం రైతులు టిక్కీలను భారీగా తీసుకువచ్చారు. సీజన్ ప్రారంభం అయిన తరువాత గత రెండు రోజులనుంచి యార్డుకు టిక్కీల తాకిడి పెరిగింది. కర్నూలు, ప్రకాశం, పల్నాడు జిల్లాల నుంచి ఎక్కువగా సరకు వస్తోంది. గత వారం కంటే ఈ వారం ధరలు ఏమాత్రం పెరగడలేదు. సాధారణ రకాలు ధర క్వింటాళ్ కనిష్ట ధర రూ.9 వేలు, గరిష్ట ధర రూ.21 వేలు పలికింది. మేలు రకాల సరుకు కూడా ధరలు తక్కువగానే నమోదయ్యాయి.

ప్రధానంగా తేజ, బాడిగ రకాలు కనిష్ట ధర రూ.8వేలు, గరిష్టధర రూ.22వేలు వచ్చింది. కోల్డ్ స్టోరేజీల్లో ఉన్న సరుకు కనిష్ట ధర రూ.10 వేలు, గరిష్ట ధర రూ.20వేలు వచ్చింది. అలాగే మెలురకాలు తేజ, బాడిగ వెరైటీలకు కనిష్ఠం రూ.9500, గరిష్ఠం 22వేలు ధర పలికినట్టు అధికారులు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి మంగళవారం 76,495 టిక్కీలు రాగా పాత నిల్వలతో కలిపి 73,895 టిక్కీలు అమ్ముడుపోయాయి. ఇంకా 40,355 టిక్కీలునిల్వ ఉన్నాయి. సోమవారం గరిష్ఠంగా 70 వేల టిక్కీలు వచ్చాయి.

గత నెల రోజుల్లో ఎక్కువ సరుకు రావడంతో మంగళవారం యార్డు కిటికిటలాడింది. ధరల ఆశించినంత లేకపోవడం వల్లరైతులు నిరాశకు గురయ్యారు. గతేడాది



ఇదేరోజుల్లో గరిష్ట ధర రూ.25 వేల వరకుపలికింది. గత 10 రోజుల్లో క్వింటాలుకి రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు తగ్గింది. సరుకు ఎక్కువగా వస్తుండటంతో వ్యాపారులు ధరలను క్రమంగా తగ్గిస్తున్నారు. ఎగుమతి అవకాశాలు తగ్గడం, పెద్దఎత్తున సరుకు వస్తుండటంతో వ్యాపారులు ధరలను తగ్గిస్తున్నారు.అంతేగాక తేమశాతం ఎక్కువగా ఉందని, ఆరబెట్టుకుని తీసుకురమ్మని షరతువిధిస్తున్నారు. ఎండతీవ్రత లేకపోవడం ▶ 2లో

సమగ్ర శిక్ష ఉద్యోగులకు నోటీసులు

- ఉద్యోగాల్లో చేరే సందర్భంలో ఒప్పంద పత్రాలను ఉదహరిస్తూ షోకాజులు జారీచేసిన ఉన్నతాధికారులు
- చేసేదేమీ లేక సమ్మెను విరమిస్తున్నామని, ఎన్నికల్లో మాత్రం బుద్ధి చెబుతామని ఉద్యోగుల ప్రకటన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సమ్మెలో ఉన్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు హెచ్చరికలు జారీ చేస్తూ ఉన్నతాకారులు నోటీసులు జారీ చేశారు. ఉద్యోగాలు పొందిన సందర్భంలో ఒప్పంద పత్రాల్లోని అంశాలను ఉదహరిస్తూ షోకాజు నోటీసులు జారీ చేశారు. దీంతో తాము బుధవారం నుండి విధుల్లో చేరుతున్నట్లు ఉద్యోగులు ప్రకటించారు. అయితే ఎన్నికల్లో మాత్రం ఈ ప్రభుత్వానికి సరైనరీతిలో బుద్ధి చెబుతామని అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశానుసారం సమాన పనికి సమాన వేతనం, గ్రాట్యుటీ, ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర అంశాలపై ఏపీ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జేఏసీ ఆధ్వర్యంలో 21 రోజులగా ఉద్యోగులు సమ్మె చేస్తున్నారు. తాజాగా ఉన్నతాధికారుల నోటీసులతో ఉద్యోగులు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. ప్రభుత్వం తమతో వెట్టి చాకిరీ చేయించుకుంటోందని, సమస్యలను పరిష్కరించకుండా బెదిరింపులకు పాల్పడ్డం దుర్మార్గపు చర్యని అన్నారు.

థియేటర్లు బద్ధలైపోతాయ్!

అభిమానులే నాకు తల్లీదండ్రులు - గుంటూరు కారం

ప్రీ రిలీజ్ వేడుకలో మహేష్‌బాబు భావోద్వేగం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

'గుంటూరు కారం' చిత్రం ప్రీరిలీజ్ ఈవెంట్‌కు అభిమానులు భారీగా తరలివచ్చారు. గుంటూరుకు సమీపంలోని నంబూరు అడ్డరోడ్డు వద్ద జరిగిన ఈ కార్యక్రమాని అభిమానులు పెద్ద సంఖ్యలో రావడంతో తొక్కిసలాట జరిగింది. తొలుత హీరో మహేష్‌బాబు ▶ 2లో



వార్తలు 4, 5 పేజీల్లో



చిలకలూరిపేట సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న డి.రమాదేవి

అంగన్వాడీలకు ఇచ్చే జీతాలనే మంత్రులూ తీసుకోవాలి

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి

29వ రోజుకు సమ్మె

అరెస్టులకు యుటిఎఫ్ ఖండన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు రావాల్సిన బకాయిల కోసం యుటిఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడలో జరగనున్న 36 గంటల ధర్నాకు వెళుతున్న ఉపాధ్యాయులను విజయవాడ నగరంలోని లెనిన్ సెంటర్ వద్ద అరెస్టు చేయడాన్ని యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.ప్రేమ్‌కుమార్, జి.విజయసారధి మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. నిరసన హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందని, అయినా నిర్బంధాలను సైతం లెక్కచేయకుండా 300 మందికి పైగా ఉపాధ్యాయులు పల్నాడు జిల్లా నుండి దీక్షలకు వెళ్లారని పేర్కొన్నారు. అరెస్టు చేసిన బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కేసులు ఎత్తివేతపై జీవోలు దహనం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పేరు ప్రకటన సందర్భంలో జరిగిన అల్లర్లపై పెట్టిన కేసులను ఎత్తివేస్తూ జీవో 54 ఇవ్వటం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టని జై భీమ్ భారత్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు, న్యాయవాది జి.విజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని 8వ వార్డు అంబేద్కర్ విగ్రహం వద్ద జీవో ప్రతులను మంగళవారం దహనం చేశారు. అంబేద్కర్ పేరును సహించనలేని అరాచక శక్తులు దారుణానికి ఒడిగడితే వాటిని విస్మరించిన ప్రభుత్వం మరోవైపు 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నామని చెప్పటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో ఎం.సుధాకర్‌రావు, కె.ఆంథోని, వి.వెంకటేశ్వర్లు, జె.కమల్ కుమార్ పాల్గొన్నారు.

తోపుడుబండ్లు పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి

రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి, రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ వైయనాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం తాడేపల్లి పట్టణంలోని బైపాస్‌రోడ్డు గోపు ఫిల్లింగ్ స్టేషన్ వద్ద రూ.75 వేలు విలువ చేసే 6 తోపుడుబండ్లు, ఆరు ఎల్‌ఇడి ఛార్జింగ్ బల్బులు అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు పరుచూరి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ అనేక సేవా కార్యక్రమాలు తమ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు అవసరమైన మెటీరియల్ అందజేయడంతో పాటు సైకిళ్లు, కృత్రిమ చేతులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చంద్ర ఓబుల్‌రెడ్డి, కోశాధికారి నాగసురేష్, వెంకటేష్, ఎం.వివేకానందరెడ్డి, ఆర్.రమేష్‌బాబు, కె.శివన్నారాయణ, ఆర్.శ్రీనివాస్, సిహెచ్.రామకృష్ణ, సుకుమార్‌రెడ్డి, కె.రాజశేఖరరెడ్డి, శ్రీకాంత్, సిహెచ్.బుల్లిబాబు, బసివిరెడ్డి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఓటరు సమాచారం వాస్తవం కాకుంటే చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు

నూతన ఓటు కోసం 20ఏళ్ల పైబడిన కూడా వారు దరఖాస్తు చేసున్నారని, వారి నుండి తమకు ఎక్కడా ఓటు లేదని డిక్లరేషన్ తీసుకున్న తర్వాతనే పరిశీలించి ఓటు హక్కు కల్పించటం జరుగుతుందని, ఇచ్చిన డిక్లరేషన్ మేరకు సమాచారం వాస్తవం కాకుంటే తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌ఓ కీర్తి చేకూరి తెలిపారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరి రివిజన్ 2024 పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డిసంబర్ 10 తర్వాత తూర్పు నియోజక వర్గంలో 4 వేలు, పశ్చిమ నియోజకవర్గంలో 2 వేలు క్లైయిమ్స్ అందాయన్నారు. ఎన్నికల విభాగంకు రెవెన్యూ శాఖ నుండి ఇద్దరు డిప్యూటీ తహసిల్దార్లను కేటాయించామని, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశాల్లో అందించిన ఫిర్యాదులు, అర్జీలను క్రమ పద్ధతిలో రికార్డ్ చేసి, క్షేత్ర స్థాయి పరిశీలనకు బిఎల్‌ఓలకు పంపాలని ఆదేశించారు.సమావేశంలో పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌ఓ, అదనపు కమిషనర్ కె.లక్ష్మీ శివ జ్యోతి, సూపరిండెంట్ సాంబశివరావు, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ బి.భాస్కర్రావు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కార్మిక నేతలపై నిర్బంధం



నరసరావుపేట, మంగళగిరి పోలీస్‌స్టేషన్లలో అరెస్టయిన నాయకులు, అంగన్వాడీలు



నరసరావుపేట, మంగళగిరిలో రాస్తారోకో


(మొదటి పేజీ తరువాయి)

వ్యవహరిస్తుందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయమని అడుగుతుంటే ప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తుందన్నారు. ప్రభుత్వం ఇదే ధోరణితో వ్యవహరిస్తే ఇంటికి సాగనంపుతారని హెచ్చరించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నేతాజి మాట్లాడుతూ ఆందోళన చేస్తున్న వారిని ప్రభుత్వం రెచ్చగొట్టే ధోరణితో వ్యవహరిస్తుందన్నారు. అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించటం ద్వారా మొత్తం కార్మిక, ఉద్యోగ వర్గానికి ఛాలెంజ్ విసిరిందని, దీనికి తగిన గుణపాఠం ప్రభుత్వం ఎదుర్కొంటుందన్నారు.

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని గడియార స్తంభ సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు. ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు రంగప్రవేశం చేసి నాయకులను స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో సిపిఎం, సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శులు గుంటూరు విజయ్‌కుమార్, ఎ.మారుతివరప్రసాద్, టిడిపి నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కౌలు రైతు సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు వై.రాధాకృష్ణ, కె.రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.శివనాగరాణి, జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయ నాయక్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మల్లీశ్వరి, రైతుసంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.బాలకృష్ణ, ఏపూరి గోపాలరావు, ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా నాయకులు ఏడుకొండలు, పిడిఎం నాయకులు ఎన్.రామారావు, నాయకులు సిలార్ మసూద్, సాల్మన్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జి.రవిబాబు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు ఆంజనేయరాజు, కె.సాయి కుమార్, సిపిఐ నాయకులు కె.రాంబాబు, వి.వెంకట్, రంగయ్య, వివిధ సంఘాల నాయకులు జి.పిచ్చారావు, సిహెచ్.నాగమల్లేశ్వరరావు ఉన్నారు. వీరిని కొద్దిసేపటి తర్వాత స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ సమస్యలపై పోరాడుతున్న అంగన్వాడీలను బెదిరించడం మినహా సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపడం లేదని మండిపడ్డారు.

ప్రజాశక్తి - మంగళగిరి

ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు), అంగన్వాడీల యూనియన్, వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శన, స్థానిక అంబేద్కర్ సెంటర్లోని గౌతమ్ బుద్ధ రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. వీరిని పోలీసులు అరెస్టు చేసి కొద్దిసేపటి తర్వాత విడుదల చేశారు. అక్కడి నుండి నాయకులు తహశీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన చేశారు. కార్యాలయం వద్ద కొద్దిసేపు ధర్నా అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. సిఐటియు జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, ఎం.రవి, జెవి రాఘవులు, వివి జవహర్లాల్, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ, వివిధ ప్రజాసంఘాల నాయకులు సిహెచ్ రామాంజనేయులు, ఎం.పకీరయ్య, ఎం.బాలాజి, డి.రామారావు, జి.దుర్గారావు, వి.మాధవరావు, ఎం.వెంకటేశ్వరావు, ఎ.నాగబాబు, కె.కోటేశ్వరరావు, హేమలత, మేరీ రోజమ్మ, వినీల, రుక్మిణి, తిరుపతమ్మ, ఫాతిమా, కె.సు, వై.శివనాగేశ్వరరావు, పి.పూర్ణ, కె.శివనాగేశ్వరమ్మ, డి.శంకర్ పాల్గొన్నారు.



థియేటర్లు బద్ధలైపోతాయ్!

(మొదటి పేజీ తరువాయి)

అభిమానులను ఉద్దేశించి మాట్లాడుతూ కొంత భావోద్వేగానికి గురయ్యారు. 'మీకు చేతులెత్తి దండం పెట్టడం తప్ప ఏం తెలియడం లేదు... మీరెప్పుడూ నన్ను గుండెల్లో పెట్టుకుంటారు. సంక్రాంతికి వచ్చే సినిమాలు బాగా కలిసి వస్తాయి. ఈ సినిమా కూడా సంక్రాంతికి విడుదల అవుతున్నందున ఒక బ్లాక్ బస్టరే...ఈ సారి కూడా బాగా గట్టిగా కొడతాం. ఇక నుంచి మీరే నాకు అమ్మ...నాన్న...మీరే నాకు అన్ని ఆశీస్సులు ఇవ్వాలి. మీ అభిమానం నా దగ్గరే ఉండాలని కోరుకుంటున్నా' అని భాగద్వేగంతో ప్రసంగం ముగించారు. అంతకు ముందు హీరోయిన్ శ్రీలీలను ఉద్దేశించి మాట్లాడుతూ తెలుగమ్మాయి చాలారోజుల తరువాత స్టార్ హీరోయిన్ కావడం చాలాబాగుందని, ఈ అమ్మాయితో డాన్సు చేయడం వామ్మో... ఇదేండాన్సు! అని అన్నారు. సంగీత దర్శకులు తమన్ గురించి మాట్లాడుతూ కుర్చీ మడతపెట్టి పాటచేస్తావా అని తమన్‌ను అడిగితే వెంటనే ఒప్పుకొన్నాడు...రేపు థియేటర్లలో మీరు ఈ పాట చూడండి.. థియేటర్లు బద్ధలైపోతాయి అని చెప్పారు. తివిక్రమ్ అంటే నాకు చాలా ఇష్టం... ఆయన నాకు ఫ్రెండ్ కంటే ఎక్కువ.. నాకు ఫ్యామిలీ మెంబరు, కుటుంబ సభ్యుల గురించి మనం బయట ఎక్కువ చెప్పుకుంటామా అని ప్రశ్నించారు. ఆయన నాకు ఎప్పుడూ సపోర్టు చేశారు. ఆయన సినిమాల్లో నేను ఎప్పుడు చేసినా ఒక మేజిక్ జరుగుతుంది. అది నాకు తెలియదు. అతడు నుంచి నా జర్నీ మొదలైంది. ఖలేజాలో ఒక మేజిక్ జరిగింది. అదే మేజిక్ ఇప్పుడు గుంటూరు కారంలోనూ జరిగింది. మీరు కొత్త మహేష్‌బాబును చూడపోతున్నారు.. అని అన్నారు.

108 ఉద్యోగులు సమ్మె నోటీసులు

ప్రజాశక్తి-గుంటూరు

తమ సమస్యలను పరిష్కరించకుంటే ఈనెల 23వ తేదీన సమ్మె చేస్తామని 108 ఉద్యోగుల హెచ్చరించారు. ఈ మేరకు ఎపి 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసులను జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారికి, డిఎంఅండ్‌హెచ్‌ఒకు, డిసికి, 108 డిఎంకు అందచేశారు. ఈలోగా పలు రూపాల్లో వినతులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని, అప్పటికీ స్పందించకపోతే సమ్మె తప్పదని నాయకులు స్పష్టం చేశారు. నాలుగున్నరేళ్లుగా ఉద్యోగుల్ని అవుట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌లో చేరుస్తామని ఇచ్చిన హామీని అమలు చేయమని తిరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవట్లేదన్నారు. వైద్యారోగ్యశాఖలో డిఎంఇ ద్వారా నోటిఫికేషన్‌తో భర్తీ చేస్తున్న ఇఎమ్‌టి పోస్టుల్లో 108లోని ఇఎమ్‌టిలను కాంట్రాక్ట్ పద్ధతిపై నియమిస్తూ ప్రాధాన్యం కల్పించాలని, 108లోని పైలట్లకు ఆర్టీసి, ఇతర ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్ డ్రైవర్ పోస్టుల్లో నియమించాలని, ఆప్కాస్‌లో చేర్చాలని, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లోని ఉద్యోగులందర్నీ ఆప్కాస్‌లో చేర్చాలని, జిఒ ప్రకారం వేతనాలు ఇవ్వాలని, 104 ఎంఎంయు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, శ్లాబ్‌లు అప్‌గ్రేడ్ చేసి వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.యోహోషువ, ఎస్.కె.బాబు, సునన్ పాల్గొన్నారు.

మిర్చి యార్డు కిటకిట

(మొదటి పేజీ తరువాయి)

వల్ల కల్లాల్లో ఆరబెట్టుకోవడం రైతులకు ఇబ్బందిగా ఉంది. యార్డులో కూడా ఆరబోసి ఎండబెట్టుకోవడంకన్పించింది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు అయినకాడికి అమ్ముకుంటున్నారు. గుంటూరుకు సమీప ప్రాంతాల వారు మాత్రం ఒకటి రోజులు ఆరబెట్టుకుని యార్డులోనే నిద్రించి సరుకు అమ్మిన తరువాత స్వస్థలాలకు వెళ్తున్నారు. రానున్న రోజుల్లో సరుకు మరింత ఎక్కువ వచ్చే అవకాశం ఉంది. గుంటూరు,పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోమొదటి విడత కోతలు పూర్తయ్యాయి.రాయలసీమజిల్లాలో రెండోవిడత కోతలు కూడా జరిగాయి. సంక్రాంతి శెలువల తరువాత రోజుకు లక్ష టిక్కిలకుపైగావస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే కొంత మంది కోల్డ్ స్టోరేజీల్లో నిల్వచేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. బాగా ఆరబెట్టిన కాయలు కోల్డ్ స్టోరోజిల్లోనేనిల్వచేస్తున్నారు. ఇప్పటికే పాత సరుకు విక్రయాలు జరుగుతున్నాయి. చాలావరకు కోల్డ్‌స్టోరేజీలు ఖాళీ అవుతుండటంతో కొత్తసరుకు నిల్వకు అవకాశం ఏర్పడింది.

వైసిపి పాలనలో ఉద్యోగాలు కరువు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తలపెట్టిన ప్రజా పాదయాత్ర రెండవ రోజుకు చేరుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆవలంబిస్తున్న కఠినమైన తీరుపై ప్రజలతో రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి మధ్యతరగతి ప్రజల్లో ఆర్థిక ఇబ్బందులు నెలకొన్నాయని అన్నారు. నిత్యవసరాలు పెరిగాయన్నారు. యువత ఉద్యోగాల విషయాల్లో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి పార్టీని గెలిపించి చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేయాలని కోరారు. మంగళవారం అంగలకుదురు గ్రామంలో ప్రారంభమైన పాదయాత్ర గౌడ కాలనీ మీదుగా, కోపల్లె చేరుకుంది. అంగలకుదురు గ్రామానికి చెందిన ప్రసన్నగంటి వెంకటేశ్వరరావు, జమ్మల సుబ్బారావు, పట్నాల సురేష్, వలివేటి వీరభద్రుడు, వేణుగోపాలకష్ణ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అమరావతిలో ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్ ఎన్ఫోర్సు మెంట్ అధికారులు మంగళవారం సందర్శించారు. శ్రీ కష్ణ ఎంటర్ ప్రైజెస్ దుకాణంలో అనుమతులు లేకుండా, రికార్డ్స్ లేకుండా పురుగు మందులు, ఎరువులు విక్రయిస్తుండగా తనిఖీ చేసినట్టు అధికారులు తెలిపారు. మొత్తం రూ. 3,62,458 విలువ గలిగిన 365 లీటర్ల పురుగుమందులు, ఎరువుల విక్రయాలనునిలిపివేసినట్టు తెలిపారు. విజిలెన్స్ ఎన్ఫోర్స్ మెంట్ వ్యవసాయ అధికారి కె . రమణ కుమార్, సబ్ ఇన్స్పెక్టర్ రామ చంద్రయ్య స్థానిక వ్యవసాయ అధికారి మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పీకల వాగుకు కంచె ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో పిల్లలకు ప్రమాదకరంగా మారిన పీకల వాగుపై పక్కా కంచెఏర్పాటుచేయాలని బిజెపి పశ్చిమ నియోజకవర్గం కన్వీనర్ వల్లూరు జయప్రకాష్ నారాయణ కోరారు. పీకల వాగు పరిసర ప్రాంతాలను మంగళవారం ఆయనపరిశీలించారు. గత కార్పొరేషన్ ఎన్నికల్లో పీకల వాగులో ప్రమాదాలు జరగ కుండా నియంత్రిస్తామని హామీఇచ్చిన మేయర్ ఇంతవరకు పట్టించు కోలేదన్నారు. రెండేళ్ల క్రిందట చుట్టుగుంట సమీపంలోని పీకల వాగులో నాలుగేళ్ల బాలుడు ప్రమాదవశాత్తు జారి పడడంతో రాత్రింబవళ్లు వెతికిన బాలుడు ఆచూకీ దొరకలేదని మర్నాడు తెల్లవారుజామున బుడంపాడు సమీపంలో బాలుడు మృతదేహం లభ్యమైందని ఆవేదన వ్యక్తం చేశారు ఆ సమయంలో కుటుంబ సభ్యులను పరామర్శించిన మేయరు పీకల వాగు చుట్టూ ఇనుపకంచే ఏర్పాటు చేసి ఇలాంటి ప్రమాదాలు జరగకుండా అరికడతామని హామీ ఇచ్చారని ఏళ్లు గడుస్తున్నా పీకల వాగు చుట్టూ ఇనుపకంచ ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు చందు సాంబశివరావు, జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్ర కుమార్ తదితరులుపాల్గొన్నారు.

ఉపముఖ్యమంత్రిపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియా గాంధీపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చేసిన అనుచిత వ్యాఖ్యలపై తగిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు మంగళవారం పాత గుంటూరుపోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డిమరణించి 15 ఏళ్ల తరువాత ఆయన మరణంపై అనుమానాలు ఉన్నాయని చెప్పడం హస్యాస్పదంగా ఉందన్నారు. 2009నుంచి 2014 వరకు వైఎస్ రాజశేఖర్ రెడ్డిని రిలయన్స్ వారు చంపారని ప్రచారం చేసిన వైసిపినాయకులు 2019లో అధికారంలోకి రాగానే రిలయన్స్ అధినేత అంబానీ అనుచరడికి రాజ్యసభ పదవి ఇచ్చి సిఎం జగన్ వారికి రెడ్ కార్పేట్ పరిచిన విషయం ప్రజలకు తెలుసన్నారు. వైఎస్ కుమార్తె షర్మిల కాంగ్రెస్‌లో చేరగా వైసిపి వారికి రాజశేఖర్ రెడ్డి మరణంపై అనుమానాలు గుర్తుకు వచ్చాయన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చి ఐదేళ్లు అయినా ఎప్పుడు ఈ ఘటనపైనోరుపెదపని మంత్రులు ఇప్పుడు ఆకస్మికంగా రాజశేఖర్‌రెడ్డి మరణం గుర్తుకు రావడం విడ్డూరంగాఉందన్నారు. సోనియా గాంధీ గారి మీద అనుచిత వ్యాఖ్యలు చేసి, ఆమె గౌరవాన్ని భంగం కలిగించినందుకు ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి మీద కేసు నమోదు చెయ్యలని పాతగుంటూరు పోలీస్ స్టేషన్ లో సిఐ సుధాకర్ బాబుకు ఫిర్యాదు చేశామన్నారు. నగర అధ్యక్షులు షేక్ ఉస్మాన్, యస్ సి సెల్ నాయకులు పిడతల భాగ్యారాజ్ జిల్లా లీగల్ సెల్ చైర్మన్ సుధీర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి కృషి : మంత్రి రజిని

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచి మహిళల సంక్షేమమే ధ్యేయంగా సిఎంజగన్ పనిచేస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. గుంటూరు నగరం 21, 25 డివిజన్లకు చెందిన 50 మందికిపైగా మహిళలు టిడిపి నుంచి వైసిపిలో చేరారని మంత్రి తెలిపారు. వైసిపి మహిళా విభాగం నగర అధ్యక్షురాలు గనిక ఝాన్సిరాణి ఆధ్వర్యంలో మంగళవారం కొరిటెపాడు రోడ్డు చంద్రమౌళినగర్‌లోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో ఈ చేరికలు జరిగాయి. ఆర్థిక కష్టాల్లో ఎన్నో కుటుంబాలను పలు సంక్షేమ పథకాల ద్వారా వైసిపి ప్రభుత్వం ఆదుకుందన్నారు. రూ.51 వేల కోట్లతో 32 లక్షల మందికి పైగా మహిళా లబ్ధిదారులకు ఒకేసారి ఇళ్ల స్థలాల పంపిణీ, ఇళ్ల నిర్మాణం చేపట్టామన్నారు.

రూటా క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు : రియాసతి ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ 2024 క్యాలెండర్, గోడపత్రికను మంగళవారం ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్.మొహ్మద్ ఖాసిం స్థానిక చౌత్రా సెంటర్‌లోని ఉర్దూ డిఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా రూట అధ్యక్షులు అబ్దుల్ షఙీర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గయాజ్ అహ్మద్, జిల్లా కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, సయ్యద్ ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్ ముందు ఆందోళనలో టిడిపి నాయకులు శ్రావణ్ కుమార్ ,కార్యకర్తలు

పోలీస్‌స్టేషన్ ముందు టిడిపి ఆందోళన

ప్రజాశక్తి – తుళ్లూరు

మండలంలోని వడ్డమాను గ్రామంలో టిడిపి ఫ్లెక్సీ లు చించివేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదంటూ స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద మంగళవారం టిడిపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ఆందోళనకు దిగారు. రాజధాని ప్రాంతంలో ఇసుక, కంకర, మట్టి అక్రమ రవాణా సాగుతోందని చేసిన ఫిర్యాదులపై కూడా పోలీసులు ఉదాశీనంగా వ్యవరిస్తున్నారని శ్రావణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులకు కొమ్ము కాస్తున్నారని మండిపడ్డారు. అక్రమాలు చేస్తున్న వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోకుండా ఫిర్యాదు చేసిన వారిని వేధిస్తున్నారని విమర్శించారు. ఉన్నతాధికారులు వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే అరెస్ట్ చేసుకోమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ధనేకుల సుబ్బారావు, దామినేని శ్రీనివాసరావు, కాటా అప్పారావు, పుట్టి రామచంద్రరావు, చిలకా బసవయ్య, గడ్డం వెంకటేశ్వరరావు, సరిగల డేవిడ్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన

ప్రజాశక్తి-తాడేపల్లి

నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో తాడేపల్లిలోని గోడౌన్స్ వద్ద మంగళవారం కార్మికులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కోఆర్డినేటర్ బి.రమేష్ మాట్లాడుతూ బాలల పరిరక్షణ అందరి బాధ్యతన్నారు. యువత మత్తు పదార్థాల వైపు వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతకు చెప్పాలని కార్మికులను కోరారు. దీని నుంచి బయటపడాలంటే డీఅడిషన్ చికిత్స ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మేతా మేస్త్రి ఎం.కరుణ, యూనియన్ సభ్యులు రాజు, కార్మికులు పాల్గొన్నారు.

తండ్రిపై దాడి

ప్రజాశక్తి-తాడేపల్లి :85 సంవత్సరాలు వయసు గల తండ్రి పట్ల కొడుకు వ్యవహరించిన తీరు తాడేపల్లి పట్టణంలోని బ్రహ్మానందపురంలో మంగళవారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బ్రహ్మానందపురంలో 85 సంవత్సరాల వృద్ధుడు ఏ పని చేసుకోలేని పరిస్థితిలో ఇంటి వద్దనే ఉంటున్నాడు. అతనికి ఇద్దరు కొడుకులు. వారిలో లూర్దు రాజు మంగళవారం తండ్రి తలపై రక్తం వచ్చేటట్లు గాయపరిచి విచక్షణారహితంగా కొట్టడంతో స్పృహ తప్పి కిందపడిపోయాడు. స్థానికులు ఫోన్ చేసి మీడియాకు సమాచారం అందించారు. గతంలో కూడా మల్లయ్యను విచక్షణారహితంగా కొట్టడంతో ఓ కాలు విరిపోయిందని స్థానికులు అంటున్నారు. స్థానికులు వెంటనే 108కి ఫోన్ చేశారు. మల్లయ్యను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తాడేపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కెఎ పాల్ హడావుడి

ప్రజాశక్తి-తాడేపల్లి :ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకులు కెఎ పాల్ సిఎం క్యాంపు కార్యాలయం గేటు ఎదుట కొంతసేపు హడావుడి చేశారు. సిఎంను కలవాలని పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. పర్మిషన్ లేదంటూ పోలీసులు అనుతించకపోవడంతో కారు పక్కనే పెట్టుకుని కొద్దిసేపు నిరసన తెలిపారు. కొద్దిసేపు తరువాత వెనుదిరిగి వెళ్లిపోయారు.



డాక్టర్ జాన్‌డేవిడ్‌కు ఘన నివాళులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఎఎంజి, ఫార్ కార్నర్స్, వేద సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ జాన్‌డేవిడ్ 19వ వర్ధంతి సందర్భంగా స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద ఆయన విగ్రహానికి ఎంఎజి డైరెక్టర్ డాక్టర్ కంటి మహంతి, ఫార్ కార్నర్స్ డైరెక్టర్ జెస్సియస్ బర్నబాస్ పూలమాలలేసి నివాళులర్పించారు. జాన్‌డేవిడ్ సమాధి వద్ద ఎఎంజి అధినేతలు, సిబ్బంది ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎఎంజి సంస్థ ప్రాంగణంలో సభ నిర్వహించి చిలకలూరిపేట పట్టణానికి, ఇతర ప్రాంతాల్లో జాన్‌డేవిడ్ చేసిన సేవా కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. విద్యాసంస్థల్లో చదివిన వారు ఉన్నత స్థాయికి వెళ్లడంలో జాన్‌డేవిడ్ కృషిని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ కెజియా మహంతి, డాక్టర్ జాన్ సులక్షన్, ఎడ్విన్ ఫ్రాన్సిస్ పాల్, మోజస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపిపి బి.నరసింహారావు

ఎన్నికల నియమావళిపై పోలీసులకు అవగాహన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : ఎన్నికల కోడ్ అమలులోకి రాగానే తీసుకోవాల్సిన చర్యలపై పోలీసులకు సత్తెనపల్లి ఎపిపి బి.నరసింహారావు అవగాహన కల్పించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఎంపిపి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పోలీసులు పాటించాల్సిన నియమ - నిబంధనల గురించి వివరించారు. భద్రతా చర్యలు, గొడవలు జరిగినప్పుడు వ్యవహరించాల్సిన తీరు గురించి చెప్పారు. పలు అంశాలపై అమరావతి సిఐ కె.వి.బ్రహ్మం చెప్పారు.

దాతలతో మంత్రి రాంబాబు సమావేశం

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

స్థానిక ఏరియా వైద్యాశాలలో అభివృద్ధి పనులకు రూ.కోటి సాయం అందించిన గేయిల్ కంపెనీ ప్రతినిధులతో ఆస్పత్రిలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మంగళవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా అందిస్తున్న ఈ నిధులతో చేపట్టే పనులను వివరించడంతోపాటు నివేదికను కంపెనీ ప్రతినిధులకు ఇచ్చారు. ఆస్పత్రి అవసరాలకు అనుగుణంగా వైద్యులను నియమించామని, అన్ని రకాల జబ్బులకు వైద్య సేవలు అందిస్తున్నారని చెప్పారు. ఆస్పత్రిని మరింతగా అభివృద్ధి చేసేందుకు దాతల నుండి విరాళాలు సేకరిస్తున్నామన్నారు. సమావేశంలో కంపెనీ ప్రతినిధులు రమేష్, ఉపేంద్ర, వైసిపి నాయకులు పి.సూరిబాబు, వైద్యులు పాల్గొన్నారు.





నరసరావుపేటలో మానవహారం



వినుకొండ



ఈపూరు

అంగన్వాడీలకు ఇచ్చే జీతాలనే మంత్రులూ తీసుకోవాలి

ప్రజాశక్తి - చిలకలూరిపేట, యడ్లపాడు

అంగన్వాడీలకు ఇస్తున్న జీతాలనే మంత్రులు, ఎమ్మెల్యేలు తీసుకోవాలని, వాటితో ఎలా బతకాలో చెప్పాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేస్తున్న సమ్మె 29వ రోజుకు చేరింది. పట్టణంలోని గ్రంథాలయం వద్ద సమ్మె శిబిరాన్ని రమాదేవి మంగళవారం సందర్శించి సంఘీభావంగా మాట్లాడారు. అంగన్వాడీలు ఎంతో ధైర్యంగా పోరాడుతున్నారని, ప్రతి కార్యకార్త ఆదర్శవంతమైన మహిళేనని అభినందించారు. ఇలాంటి పోరాటాన్ని ఎస్మా వంటి చట్టాలు ఆపలేవని, ఇదే విషయాన్ని పాలకులు గుర్తించాలని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా దిగిరావాలని, లేకుంటే సమ్మె మరింత తీవ్రతరం అవుతుందని, వివిధ పార్టీలు, ప్రజా సంఘాలూ కలిసొస్తాయని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.రాధాకృష్ణ మద్దతుగా మాట్లాడుతూ అంగన్వాడీలకు తమ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని, ఇకమీదట పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొంటామని చెప్పారు. అనంతరం సిఐటియు సీనియర్ నాయకులు పి.సుబ్బారావు, మండల కన్వీనర్ పి.వెంకటేశ్వర్లు, యూనియన్ సెక్టార్ అధ్యక్షులు జి.సావిత్రి మాట్లాడారు. సమ్మెకు పల్నాడు జిల్లా ప్రైవేటు టీచర్స్ అండ్ లెక్చరర్ల ఫెడరేషన్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కె.చిన్నబాబు మద్దతు తెలిపారు. సమ్మె సందర్భంగా దీక్షల్లో కూర్చున్న వారికి స్వీట్లు పంచి పోరాటం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఇదిలా ఉండగా జైల్‌భరో సందర్భంగా అరెస్టయిన వారిని వెంటనే విడుదల చేయాలని అంగన్వాడీలు డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. మండల కేంద్రమైన యడ్లపాడులో అంగన్వాడీలు ప్రధాన రహదారిపై మానవహారం చేపట్టగా మద్దతుగా రమాదేవి మాట్లాడారు. అంగన్వాడీ సేవలు ఎస్మా చట్ట పరిధిలోకి రావని చెప్పారు. సిపిఎం మండల కన్వీనర్ టి.కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు పి.సుబ్బారావు మద్దతు తెలిపారు. అంగన్వాడీ నాయకులు ఎం.అరుణ, ఇ.పరిమళ, ఎస్.సరోజిని, కె.బంగారి, పి.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఈపూరు

స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద సమ్మె శిబిరాన్ని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు సందర్శించి అంగన్వాడీలకు సంఘీభావంగా మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అహంకారపూరితంగా వ్యవహరిస్తోందని, హామీలను విస్మరించిందని మండిపడ్డారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా సిఐటియు అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి, మండల నాయకులు ఎం.దేవసహాయం, టిడిపి నాయకులు ఆర్.జగ్గారావు, ఎం.శివప్రసాద్, ఎ.కోటేశ్వరరావు, బి.సైదులు, ఎ.శ్రీను పాల్గొన్నారు.



మాచర్ల



యడ్లపాడు



సత్తెనపల్లి



పిడుగురాళ్ల

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని గాంధీ పార్క్ వద్ద ధర్నా చౌక్‌లో అంగన్వాడీల సమ్మె శిబిరం కొనసాగుతోంది. పలువురు అంగన్వాడీలు దీక్షలు చేపట్టగా వారికి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మల్లేశ్వరి పూలమాలవేసి దీక్షలను ప్రారంభించి మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చిన ఈ ఐదేళ్లలో ఎన్నోసార్లు విద్యుత్, బస్సు, రైల్వే, నిత్యావసర సరుకులు ధరలు పెరిగాయని, అయితే అంగన్వాడీల వేతనాలు మాత్రం ఒక్కసారి తూతూమంత్రంగా పెంచారని చెప్పారు. ఎస్మాను ప్రయోగించిన ప్రభుత్వం 4వ తరగతి ఉద్యోగులుగా కనీస వేతనాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి మాట్లాడుతూ గతంలో ఎస్మాను ప్రయోగించిన అనేక ప్రభుత్వాలు భూస్థాపితం అయ్యాయని, అదే జాబితాలోకి వైసిపి చేరబోతుందని హెచ్చరించారు. బెదిరించి, భయభ్రాంతులకు గురిచేసినా భయపడేది లేదని, డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించే వరకూ సమ్మె కొనసాగుతుందని, వారికి అండగా ప్రజా సంఘాలుంటాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు కెపి మెటిల్డాదేవి, నాయకులు నిర్మల, మాధవి, కవిత, సాయి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఎస్మా చట్టం ప్రయోగానికి వ్యతిరేకంగా రాస్తారోకో చేస్తున్న అఖిలపక్ష నాయకులను పోలీసులు స్టేషన్‌కు తరలించడాన్ని నిరసిస్తూ శిబిరం ఎదుట రోడ్డుపై అంగన్వాడీలు మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు.

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక సురేష్ మహల్ రోడ్డులోని అంగన్వాడీల సమ్మె శిబిరం కొనసాగుతోంది. నిరసనలో భాగంగా అంగన్వాడీలు చెవులో పువ్వుతో నిరసన తెలిపారు. మాజీ ఎంపిపి ఎల్.వెంకట్రావు, గంగినేని ఫౌండేషన్ చైర్మన్ జి.రాఘవ, సిహెచ్.ఏడుకొండలు, ఆదిలక్ష్మి, కె.బాలరాజు, విశ్రాంత ఎంఇఒ జాన్‌సుందర్‌రావు, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వి.చంద్రమౌళి, షరీఫ్, శ్రీనివాసరావు, గురుబాబు, మహమ్మద్ ఖాన్ తదితరులు సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. విజయం సాధించే వరకూ పోరాడాలని, తామూ అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు ప్రసన్న లక్ష్మి, బి.శ్రీదేవి, జి.పద్మ, కృష్ణకుమారి, పి.ఉమశంకరి, నిర్మల, నాగజ్యోతి, గాయత్రి, డి.బీబూలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలో సమ్మె శిబిరం కొనసాగుతోంది. యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు షేక్ హాజర, డి.శాంతమణి మాట్లాడారు. రామలక్ష్మి, బుజ్జి, సుజాత, రమణ, ఆషా, సఫియా పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

సమ్మె శిబిరాన్ని కెసిపి ఉద్యోగులు సందర్శించి మద్దతు తెలిపారు. అంగన్వాడీలపై ఎస్మా చట్టం ప్రయోగించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. యూనియన్ నాయకులు ఉషారాణి, ఇందిర, కాకర్ల పద్మావతి, శాంతలత, కోటేశ్వరి, సుందరలీల, శారద, దుర్గా శివలక్ష్మి, రుక్మిణి, జయలక్ష్మి, శివపార్వతీ, లీలావతి, వెంకటరమణ, సైదమ్మ, చిలకమ్మ, మల్లేశ్వరి, కెసిపి ఉద్యోగులు బి.మహేష్, వై.సురేష్, శోభన్‌కుమార్, వెంకటరత్నం, బి.శ్రీను, పవర్ గ్రిడ్ కార్మికులు రమణరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

సమ్మె శిబిరం కొనసాగింది. సిఐటియు మండల కార్యదర్శి పి.మహేష్ మాట్లాడారు. నాడు అక్కయ్య, చెల్లెమ్మ, పెద్దమ్మ అని పిలిచినా ఆప్యాయతలు నేడు ఏమయ్యాయని పలువురు అంగన్వాడీలు ప్రశ్నించారు. సమ్మె విరమించాలని సిఎం దండం పెట్టి చెబితే తాము లక్ష దండాలు పెట్టి కనీకం చూపించాలని అడుగుతున్నామని అన్నారు. ఇదిలా ఉండగా అంగన్వాడీలు రాస్తారోకో చేస్తారేమోనని శిబిరం వద్ద పోలీసులు భారీగా మోహరించారు. కార్యక్రమంలో నాయకులు రాజకుమార్, సుజాత, అహల్య, చాముండేశ్వరి, ధనలక్ష్మి, దుర్గాభవాని, జ్యోతి పాల్గొన్నారు.

జనం బాగు కోసం మా బతుకులు మురికి

ప్రభుత్వం స్పందించి వెలుగులు నింపాలి - 15వ రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి సత్తెనపల్లి టౌన్

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగాలను పర్మినెంట్ చెయ్యాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె 15వ రోజుకు చేరింది. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా అధ్యక్షులు చంద్రకళ మాట్లాడుతూ సిఎం మాటలకు, చేతలకు పొంతన ఉండడం లేదని, పేదల పక్షపాతినంటూ చెప్పుకునే ఆయనకు మున్సిపల్ కార్మికులు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. జీవితాలను మురికిమయం చేసుకొని చాలీచాలని వేతనాలతో బతుకుతున్న కార్మికులు జీవితాల్లో ప్రభుత్వం వెలుగులు నింపాలేగాని నిర్లక్ష్యం కూడదని ఆవేదన వెలిబుచ్చారు. కార్యక్రమంలో సిహెచ్.వెంకయ్య, జి.అచ్చమ్మ, జి.తిరుపతమ్మ, సిహెచ్.సునీత, డి.చుక్కమ్మ, కోటేశ్వరి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలోని సమ్మె శిబిరం కొనసాగుతోంది. కార్మికులు కె.సీతారామయ్య, కొండలు, అభిలాష్, రామయ్య, శివ, గురవయ్య, కె.సాగర్‌బాబు, కె.వెంకటేశ్వర్లు, డి.లక్ష్మి, పద్మ, కె.వీరమ్మ, పున్నమ్మ, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. అనంతరం పట్టణంలోని ప్రధాన వీధుల్లో భిక్షాటన చేశారు. ఎఐటియుసి ఏరియా కార్యదర్శి బి.శ్రీనివాసరావు, నాయకులు పి.వెంకటేశ్వర్లు, కె.మల్లికార్జున, ఎస్.అబ్రహం రాజు, పి.ఏసు, ఆర్.ఏసుపాదం, ఎం.ఇస్రాయేలు, బి.నాగరాణి, కె.రాములు, పి.శారమ్మ, జె.ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలో సమ్మె శిబిరం కొనసాగుతోంది. సిఐటియు నాయకులు బి.మహేష్, జెఎసి కన్వీనర్ పి.అబ్రహం లింకన్ మాట్లాడారు. నాయకులు, కార్మికులు కె.రమణ, అనసూయ, బి.చిన్నమ్మాయి, లక్ష్మీదేవి, డి.రమణ, ఇస్సాకు, ఆంజమ్మ, మల్లమ్మ, సుబ్బారావు, డి.వెంకటేశ్వర్లు, కోటేశ్వరి, గురవమ్మ, లక్ష్మమ్మ, కోటేశ్వరరావు, కోటేశ్వరమ్మ, ఎం.కన్నయ్య, సంతోషమ్మ పాల్గొన్నారు.



వినుకొండ, పిడుగురాళ్ల





మాచర్ల



సత్తెనపల్లి

అంగన్వాడీలతో పెట్టుకుంటే ప్రభుత్వాలు కూలుతాయి

ప్రజాశక్తి-తాడేపల్లి

అంగన్‌వాడీలకు ఎస్మా వర్తించదని సిఐటియు రాష్ట్ర నాయకులు పి.రోజా తెలిపారు. అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపిన ఆమె మంగళవారం తాడేపల్లి తహశీల్దార్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాలో ప్రసంగించారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు విరమించుకోవాలన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు గౌరవ వేతనం పొందుతున్నారని ప్రభుత్వం చెబుతున్న అంగన్‌వాడీలకు ఎస్మా చట్టం ఎలా వర్తిస్తుందని ప్రశ్నించారు. అంగన్‌వాడీలతో పెట్టుకున్న ఏ రాష్ట్ర ప్రభుత్వం బతికి బట్టకట్టలేదని తేల్చి చెప్పారు. అబద్దాల పత్రిక ద్వారా అబద్దాలను ప్రచారం చేయడం ప్రభుత్వానికి సరికాదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా బేషజాలకు పోకుండా వెంటనే అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలన్నారు. మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె పట్ల కూడా ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు వేముల దుర్గారావు, ఎఐఎఫ్‌టియు, టిఎన్‌టియుసి, తెలుగు రైతు సంఘం, ఎఐటియుసి నాయకులు చెన్నయ్య, ఆదినారాయణ, రాము, శ్రీనివాసరావు, కళ్లం రాజశేఖరరెడ్డి, టి.వెంకటయ్య, అంగన్‌వాడీలు పాల్గొన్నారు. మున్సిపల్ కార్మికులు, అంగన్‌వాడీలు పెద్దఎత్తున తరలిరావడంతో ఆ ప్రాంతమంతా నినాదాలతో మారుమోగింది.


తాడేపల్లిలో మద్దతు తెలిపి మాట్లాడుతున్న సిఐటియు నేత రోజా


దుగ్గిరాలలో


కొల్లిపరలో


గుంటూరులో

ప్రజాశక్తి-గుంటూరు : అంగన్‌వాడీల నిరవధిక సమ్మె 29వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మంగళవారం గుంటూరు కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరంలో రిలే నిరాహార దీక్షలు రెండో రోజు కొనసాగించారు. ఈ దీక్షలను ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా, నగర ప్రధాన కార్యదర్శులు పి.దీప్తి మనోజ, టి.రాధ ప్రారంభించారు. దీక్షల్లో డి.వేదవతి, ఆర్.రాధిక, జె.సుమతి, బి.రాధ, బి.అన్నపూర్ణ, చిన్న వెంకాయమ్మ, డి.నవనీతం, ఎ.నాగేశ్వరి, కె.సీతామహాలక్ష్మి, సిహెచ్.బుజ్జి, ఇ.జ్యోతి కూర్చున్నారు. సమ్మెకు గడ్డం రోశయ్య, ఆళ్ల హరి, సోమి ఉదయ్‌కుమార్ మద్దతు తెలిపారు.

ప్రజాశక్తి తెనాలి రూరల్

స్థానిక విఎస్ఆర్ అండ్ ఎన్విఆర్ కళాశాల ఎదురుగా నిర్వహిస్తున్న సమ్మెకు సిఐటియు, సిపిఎం పూర్తి మద్దతును తెలుపుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా నిరశిస్తున్న అంగన్వాడీల బలవంతపు అరెస్టులు చేయడం పట్ల సిఐటియు పూర్తిగా ఖండిస్తుందని సిపిఎం తెనాలి ఏరియా కమిటీ కార్యదర్శి కొల్లిపర బాబు ప్రసాద్ మండిపడ్డారు. . ఎస్మా చట్టాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎవిఎన్ కుమారి తెనాలి అధ్యక్షురాలు టి అనురాధ పీ రత్నకుమారి, జె కనకదుర్గ, కె కమలమ్మ, కె శివ పార్వతి, సిహెచ్ ప్రసన్న, కె నాగలక్ష్మి, టి కష్ణ కుమారి, కె వీరమణి, సిఐటియు నాయకులు హుస్సేన్ వలి తదితరులు పాల్గొన్నారు.


పెదనందిపాడులో


పొన్నూరులో


ఫిరంగిపురంలో

ప్రజాశక్తి - పెదనందిపాడు :ఎదనందిపాడు లో పొర్లు దండాలు పెడుతూ. ప్రజాశక్తి పెదనందిపాడు రూరల్. పెదనందిపాడు లో అంగన్వాడీలు చేస్తున్న సమ్మె మంగళవారానికి 29వ రోజుకు చేరుకున్నది. సంఘ మండల అధ్యక్షురాలు శివకుమారి కార్యదర్శి శ్రీదేవి ఆధ్వర్యంలో అంగన్వాడీలు పొర్లు దండాలు పెడుతూ నిరసన వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి - ఫిరంగిపురం : ఫిరంగిపురంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎస్మా చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని, అంగన్వాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ చేతులకు బేడీలు వేసుకుని అంగన్వాడీలు 29వ రోజు సమ్మెలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడికొండ :తాడొకొండలో సమ్మె శిబిరం కొనసాగుతంది.


తాడికొండలో

కార్యక్రమంలో వెంకటలక్ష్మి, సుబ్బాయమ్మ, రాణి, ప్రేమ కుమారి తదితరులు పాల్గొన్నారు

ప్రజాశక్తి పొన్నూరు రూరల్ : అంగన్వాడి యూనియన్ అధ్యక్షురాలు ఎం వి సుకన్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అంగన్వాడీలకు అన్యాయం చేశారన్నారు. పోరాటాన్ని అణిచేందుకు ఎస్మా చట్టం ప్రయోగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.వి సుకన్య. డి పద్మజ. ప్రాజెక్ట్ లీడర్ పిడి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కొల్లిపర : రాష్ట్ర ప్రభుత్వము కనీస వేతనం గ్రాడ్యుటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరుతుంటే నోటీసులు ఇస్తూ విధులకు హాజరుకావాలని హాజరు కాకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని బెదిరింపు ధోరణిలో వ్యవహరించడం అన్యాయమని యూనియన్ మండల అధ్యక్షురాలు నిర్మల జ్యోతి అన్నారు. అంగన్వాడీలు దీక్ష శిబిరంలోనిద్రపోతున్నట్లు నటిస్తూ నిరసన తెలిపారు కార్యక్రమంలో సీతమ్మ సుశీల షాహిదా శ్రీ లక్ష్మీ ధనలక్ష్మి నిర్మల లక్ష్మీకుమారి వి హిమానిఅంగన్వాడీలు ఆయాలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి దుగ్గిరాల : స్థానిక ఇన్నాన్ గ్యాస్ ఏజెన్సీస్ సమీపంలో తెనాలి విజయవాడ రహదారిపై మంగళవారం అంగన్వాడీలు రాస్తారోకో నిర్వహించారు. అంతకుముందు దీక్ష శిబిరం నుండి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది వై స్టాలిన్ మాట్లాడుతూ చర్చలు విఫ్రమయ్యాయి సుప్రీంకోర్టు వెళ్ళమని మంత్రి బస సత్యనారాయణ వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డారు. పాదయాత్రలో జగన్ చేసిన వాగ్దానం నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జట్టి బాలరాజు ఎన్ యోగేశ్వరరావు బి సామి రెడ్డి మరియు అంగన్వాడీలు పాల్గొన్నారు.


తెనాలిలో

బిజెపిని ఓడించాలి : సిపిఎం


మాట్లాడుతున్న పాశం రామారావు

ప్రజాశక్తి-తాడేపల్లి

మోడీ, షా హటావో దేశ్‌కి బచావో పిలుపును జయప్రదం చేసి దేశాన్ని రక్షించాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ దేశ సంపదను లూటీ చేసి ఆదానీ అంబానీలకు కట్టబెడుతూ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తున్న మోడీ, షాలను ఓడించడంతో పాటు వారికి మద్దతు ఇస్తున్న వారిని కూడా ఓడించాలని కోరారు. మంగళవారం రాత్రి తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో జరిగిన సిపిఎం పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసినా రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బిజెపికి మద్దతు ఇస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. లౌకికతత్వం సమైక్య స్ఫూర్తిని భారత రాజ్యంగాన్ని రక్షించుకోవడానికి అందరూ కదలిరావాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యారావు మాట్లాడుతూ ఈ నెల 12న విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో దేశాన్ని రక్షించుకోవడానికి కలిసి వచ్చే శక్తులు, సంస్థలు, పార్టీలు, మేధావులతో భారీ సమ్మేళనం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, కొట్టె కరుణాకరరావు, డి.శ్రీనివాసకుమారి, ఎం.శ్రీనివాసరెడ్డి, డివి భాస్కరరెడ్డి, కె.సామ్యేలు, డి.విజయబాబు, కె.మేరి పాల్గొన్నారు.



15వ రోజు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి మంగళగిరి రూరల్

రాజధాని లోని ఎర్రబాలెంలో మంగళవారం మున్సిపల్ కార్మికులు 15వ రోజు నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో రాజధాని ప్రాంత మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం రవి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమ్మె కొనసాగడానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. మంత్రివర్గం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే జీవోల రూపంలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం గతంలో లాగా హామీలు ఇచ్చి విస్మరిస్తే కార్మికులు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. మున్సిపల్ కార్మికులపై పోలీసుల దమన కాండను ఆపివేయకపోతే ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని రవి హెచ్చరించారు.. ఈ నిరసన కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు టి బాబు ఓ రామారావు టి ఆదిలక్ష్మి కే కోటేశ్వరి ఎన్ దివ్య ఎం పార్వతి తదితరులు పాల్గొన్నారు.



తెనాలిలో పంగనామాలతో మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి తెనాలి : కార్మికుల సమస్యలు పరిష్కరించి వారికి ప్రయోజనం చేకూరుస్తుందని ప్రభుత్వంపై నమ్మకం ఉంచిన కార్మికులకు చివరికి పంగనామాలు పెట్టారని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మంగళగిరి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో కార్మికులు పంగనామాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలనే నెరవేర్చాలని కోరుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరారు. యూనియన్ గౌరవాధ్యక్షులు షేక్ హుస్సేన్ వలి మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని దష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కార్మికులు, కార్మిక సంఘాలతో చర్చలు జరిపి వారికి న్యాయం చేసి సమ్మె విరమింప చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎం పద్మ, వి సుధాకర్, ఆర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

మా సమస్యలు పరిష్కరించరూ...

మంత్రి విడదల రజనికి సమగ్ర శిక్ష ఉద్యోగులు వినతిపత్రం

ప్రజాశక్తి-గుంటూరు


మంత్రి రజనికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

సమగ్ర శిక్షా ఉద్యోగుల న్యాయమైన కోర్కెలను ముఖ్యమంత్రి దష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు కోరారు. ఈ మేరకు మంత్రి విడదల రజనికి చంద్రమౌళి నగర్‌లోని ఆమె కార్యాలయం వద్ద కలిసి వినతిపత్రం అందచేశారు. విద్యాశాఖలో విలీనం చేసి, సమాన పనికి సమాన వేతనం ఇస్తామని, రెగ్యులర్ చేస్తామని పాదయాత్రలో జగన్మోమన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఈలోగా సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. మంత్రి రజిని మాట్లాడుతూ ముఖ్యమంత్రి మహిళా పక్షపాతి అని, సమగ్ర శిక్షలో అధిక శాతం మహిళా ఉద్యోగులు పనిచేస్తున్నారని, కావున వారి సమస్యను ముఖ్యమంత్రి దష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే కలెక్టరేట్ ఎదుట 21వ రోజు సమ్మె శిబిరం కొనసాగింది. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జెఎసి జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్, అబ్దుల్ రెహమాన్, కోశాధికారి యం.గంగయ్య, కె.కిరణ్ కుమార్ తదితరులు ప్రసంగించారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీరని నిర్లక్ష్యం వహిస్తుందని ఏపి మోడల్ స్కూల్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు పేరయ్య అన్నారు. తమ సమస్యలు పరిష్కారం కోరుతూ ఏపి సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఏంజెల్ టాకీస్ వద్ద ధర్నా చౌక్ లో ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతుంది. ఉద్యోగులకు సంఘీభావం తెలిపిన పేరయ్య మాట్లాడుతూ తమ డిమాండ్ల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రాథమిక విద్య వద్ధి కోసం అంగన్వాడి మధ్యాహ్నం భోజన పథకం సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎంతగానో కష్టపడి పని చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం జీడిపిలో 6 శాతం మాత్రమే ప్రాథమిక విద్యకు కేటాయించడం సరికాదని దీనిని రెట్టింపు చేయాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రాథమిక విద్యకు బడ్జెట్లో నిధులు పెంచాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు పి రామకృష్ణ. పి సాంబశివరావు, వెంకట్, శ్రీకాంత్, అంజిరెడ్డి, రజని, వై.సుబ్బాయమ్మ, కాంచన తదితరులు పాల్గొన్నారు.


సమ్మె శిబిరంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు



భోగి మంటలు వేస్తున్న కళాశాల సెక్రటరీ అట్లూరి శాంతి

ఎఎం రెడ్డి విద్యాసంస్థలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలం పెట్లూరువారిపాలెంలోని ఎఎం రెడ్డి స్మారక విద్యాసంస్థలలో మంగళవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కళాశాల సెక్రటరీ అట్లూరు శాంతి శ్రీనివాసరెడ్డి హాజరై భోగి మంటలు వేసి ప్రారంభించి మాట్లాడారు. తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబిచేలా ప్రతి ఏడాది తమ కళాశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. పండుగ విశిష్టతను తెలియజేస్తూ ముగ్గుల పోటీలు, గ్రామీణ క్రీడలు నిర్వహించామని, కాలేజీ ప్రాంగణంలో బసవన్నలతో ఆటపాటలు, పొంగళ్లు పెట్టడం, ఉట్టి కొట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించామని వివరించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎఎం రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గణేష్ ప్రసాద్‌రెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.భార్గవ్ భూషణ్‌రావు, డిప్లమా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కృష్ణారెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ లక్ష్మీ సురేఖ, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల్లో వేడుకలు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మండలంలోని జానపాడు వద్దగల ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థల్లో మంగళవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాఠశాల డైరెక్టర్ బొల్లా గిరిబాబు, కరస్పాండెంట్ బొల్లా శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. నేటి తరం విద్యార్థులకు తెలుగు పండగలు, తెలుగుదనం, సంప్రదాయాల గురించి తెలిసేలా సంబరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. బొమ్మల కొలువులు, పిండివంటలు, పశువుల పాకలు, ఎద్దుల బండ్లు వంటివి ఏర్పాటు చేసి విద్యార్థులకు సంప్రదాయాల పట్ల అవగాహన కలిగే విధంగా చేశామన్నారు. అనంతరం విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో అలరించారు.



వాణి విద్యానికేతన్‌లో సంబరాలు

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలోని పిడబ్ల్యూడి కాలనీలోని వాణివిద్యానికేతన్‌లో సంక్రాంతి సంబరాలు నిర్వహించగా విద్యార్థులకు, ఉపాధ్యాయినులకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. భోగి మంటలు వేసి కోలాటాన్ని ప్రదర్శించారు. చిన్నారి విద్యార్థులకు హెచ్‌ఎం కెవి రమణ, డైరెక్టర్ ఆంజనీ కుమారీ భోగి పళ్లు పోసి ఆశీర్వదించారు. పండుగ విశేషాలను వివరించారు.

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పేరుతో సామాజిక సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

విజయవాడలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరణ, స్మృతివనం ఏర్పాటు సందర్భంగా జిల్లావ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా నరసరావుపేట మున్సిపల్ కార్యాలయం నుండి గడియార స్తంభం సెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు విద్యార్థులతో జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రదర్శన చేపట్టారు. సెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి జెసి పూలమాలలేసి నివాళులర్పించి మాట్లాడారు. భారత రాజ్యాంగ రచనలో అంబేద్కర్ కృషిని వివరించి కొనియాడారు. ఈనెల 19న విజయవాడలోని జింఖానా గ్రౌండ్స్‌లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం, స్మృతి వనాన్ని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించన్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఈనెల 7వ తేదీ నుండి పల్నాడు జిల్లాలో అన్ని గ్రామాల్లో, అన్ని



నరసరావుపేటలో అంబేద్కర్ విగ్రహం వద్ద విద్యార్థులతో జెసి



మాచర్లలో సంతకాల సేకరణలో అధికారులు, ప్రజాప్రతినిధులు

సచివాలయాల పరిధిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరున అనేక సామాజిక సేవ కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించామన్నారు. అంబేద్కర్ విగ్రహాల వద్ద అనేక సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు.

ప్రజాశక్తి - మాచర్ల

డా.బిఆర్ అంబేద్కర్ విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమం సందర్భంగా సామాజిక న్యాయ మహాశిల్పం సంతకాల సేకరణను ఎంపిడిఒ సరోజినీదేవి, ఎంపిపి బి.మంగమ్మ కుమారుడు బి.శ్రీనివాసరావు ప్రారంభించారు.

కబడ్డీ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం



జట్లకు బహుమతులు ప్రదానం చేస్తున్న వర్ల రామయ్య, జీవీ ఆంజనేయులు, కన్నా లక్ష్మీనారాయణ తదితరులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఆడుదాం ఆంధ్రాకు ప్రజా స్పందన కరువైందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. టిడిపి ఆధ్వర్యంలో సత్తెనపల్లి విద్యాకేంద్రంలో జరుగుతున్న కబడ్డీ పోటీలు మంగళవారంతో ముగియగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి వర్ల రామయ్యతోపాటు టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జివి ఆంజనేయులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వర్ల రామయ్య మాట్లాడుతూ ఒక్క చాన్స్ అంటూ జగన్మోహన్‌రెడ్డి ప్రజలను మోసం చేశారని అన్నారు. టిడిపి హయాంలో క్రీడలను ప్రోత్సహించామని, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గ్రేస్ మార్కులు కల్పించాలనే ఆలోచన జగన్మోహన్‌రెడ్డికి లేదని విమర్శించారు. జివి ఆంజనేయులు మాట్లాడుతూ జగన్ అవినీతి సొమ్మును లెక్కపెట్టుకుంటూ ప్రజల బాగోగులు మర్చిపోయారని విమర్శించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ స్థానిక క్రీడాకారులను ప్రోత్సహించేందుకే నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. ఇదిలా ఉండగా మహిళ కబడ్డీ టోర్నమెంట్‌లో కృష్ణా యూనివర్సిటీ జుట్టు మొదటి బహుమతి, రెండో బహుమతి సత్తెనపల్లి పిఎ జుట్లు కేవసం చేసుకున్నాయి. పురుషుల కబడ్డీ పోటీల్లో నకరికల్లు 7 స్టార్ జుట్టు ప్రథమ బహుమతి, దేచవరం మోడల్ స్కూల్ జుట్టు రెండో బహుమతిని సాధించాయి. ఈ సందర్భంగా జాతీయ క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి వై.రామ స్వామి, నియోజకవర్గ పరిశీలకులు టి.జయప్రకాష్ నారా యణ, ప్రోగ్రామ్ కన్వీనర్ డి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వైవి నారాయణ

జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు సాయితిరుమల ఇంజినీరింగ్ విద్యార్థులు

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

అనంతపురం జిల్లా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 3-6 తేదీల్లో జరిగిన 26వ అంతర పాలిటెక్నిక్ కళాశాలల ఆటల పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటి జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారని సాయి తిరుమల కళాశాల డైరెక్టర్ డాక్టర్ వైవి నారాయణ తెలిపారు. తమ కళాశాలకు చెందిన బోరుగడ్డ జాయ్ కుమార్ సింగిల్ విభాగంలో, అదేవిధంగా డబల్ విభాగంలో షేక్ రెహమాన్‌తో కలిసి ద్వితీయ స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రిన్సిపల్ ప్రసాదరావు, వ్యాయామ అధ్యాపకులు బి.ఆంజనేయులు, అధ్యాపకులు అభినందించారు. క్రీడాకరులను కళాశాల చైర్మన్ బొల్లా బ్రహ్మానాయుడు, వైస్ చైర్మన్ బత్తిన నాగేశ్వరరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ, జాయింట్ సెక్రెటరీ నలబోతు వెంకట్రావు, ట్రెజరర్ డి.బ్రహ్మానందం ప్రత్యేకంగా అభినందించారు.

'జయహో బీసీ' ప్రచార రథాలు ప్రారంభం



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా అన్ని విధాలుగా ప్రాధాన్యమిచ్చింది టిడిపియేనని ఆ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు అన్నారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని టిడిపి జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా జయహో బీసీ కార్యక్రమం నిర్వహిస్తామని, 40 రోజుల పాటు జరిగే కార్యక్రమంలో... వైసిపి ప్రభుత్వం హయాలో బీసీలపై జరుగుతున్న అరాచకాలను ప్రజలకు వివరిస్తామని చెప్పారు. బీసీలకు వైసిపి తీరని అన్యాయం చేసిందని, రూ.75 వేల కోట్ల బిసి సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించారని, బీసీలకు రావాల్సిన 30 పథకాలను నిలిపేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ పల్నాడులో బీసీలపై వైసిపి నేతలు అనేక దొంగ కేసులు పెట్టారన్నారని, రాబోయే ఎన్నికల్లో వైసిపికి బీసీలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సందర్భంగా వైసిపి పాలనలో బీసీలపై జరిగిన దాడులను పేర్కొంటూ రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం 'జయహో బీసీ' ప్రచార రథాలను ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి జాతీయ క్రమశిక్షణ కమిటీ మెంబర్ జి.నాగేశ్వరరావు, డాక్టర్స్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, రాష్ట్ర రజక సాధికార సమితి కన్వీనర్ జి.రామకృష్ణ, రాష్ట్ర భట్రాజుల సాధికార సమితి కన్వీనర్ ప్రసన్నాంజనేయ రాజు, జిల్లా బిసి సెల్ అధ్యక్షులు ఎం.రాంబాబు, ఉపాధ్యక్షులు సాంబశివరావు, నియోజకవర్గ అధ్యక్షులు టి.నరసింహారావు, నాయకులు కడియం కోటి సుబ్బారావు. పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట

టిడిపి-జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పాటును బీసీలంతా కోరుకుంటున్నారని మాజీమంత్రి పత్తిపాటి పుల్లారావు అన్నారు. స్థానిక పండరీపురంలోని తన నివాసం వద్ద జయహో బీసీ ప్రచార రథాన్ని జనసేన నాయకులు టి.రాజారమేష్‌తో కలిసి పుల్లారావు మంగళవారం ప్రారంభించారు. ఈ నాలుగున్నరేళ్ల వైసిపి పాలనలో బీసీలను అణగదొక్కారని, ఇప్పుడు బీసీ సాధికార యాత్ర పేరుతో మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఎస్సీలకున్న 27 రకాల సంక్షేమ పథకాల రద్దు, బీసీల రిజర్వేషన్ల తగ్గింపుపై జగన్‌మోహన్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన శ్రేణులు పాల్గొన్నాయి.

నేడు డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి - వినుకొండ

ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం స్థానిక ఆర్‌టిసి డిపోలో బుధవారం డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ మంగళవారం తెలిపారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రయాణికులు 9959225431 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు, సలహాలు చెప్పొచ్చని పేర్కొన్నారు.

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు వాగ్దేవి విద్యార్థి

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గతేడాది డిసెంబర్ 6, 7, 8 తేదీల్లో నరసరావుపేట పట్టణంలోని జిల్లా క్రీడా ప్రాంగణంలో జరిగిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలలో ప్రతిభ చాటిన వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థి ఎస్.కె హుస్సేన్ మహీఫ్ జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు తెలిపారు. ప్రతిభ చాటిన తమ విద్యార్థి ఈ నెల 14న బీహార్‌లో జరిగే నేషనల్ మీట్ ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్య వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో మహీఫ్‌ను కళాశాల సెక్రటరీ-కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, కపిలవాయి రాజేంద్రప్రసాద్, పాశం కృష్ణారావు, పివి అచ్యుతరావు, ఫిజికల్ డైరెక్టర్ రాయల ఆంజనేయులు అభినందించారు.



హుస్సేన్ మహీఫ్‌ను అభినందిస్తున్న రాయల శ్రీనివాసరావు

మంగళగిరి ప్రీమియర్ లీగ్-2 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ తెలుగు యువత ఆధ్వర్యంలో మంగళగిరి పట్టణంలోని నారా లోకేష్ క్రీడా ప్రాంగణం (భోగి ఎస్టేట్స్)లో మంగళగిరి ప్రీమియర్ లీగ్-2 క్రికెట్ టోర్నమెంట్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. గుంటూరు పార్లమెంట్ అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్, గుంటూరు తూర్పు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ మహమ్మద్ నసీర్ అహ్మద్, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎం.ఎస్ రాజు, నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, స్థానిక టీడీపీ, జనసేన నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గుంటూరు పార్లమెంట్ అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ నుంచి 28వ తేదీ వరకు పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు రూ.2లక్షలు ప్రధమ, రూ.50వేలు ద్వితీయ బహుమతులు ఇస్తారని తెలిపారు. రూ.10వేలు మ్యాన్‌ఆఫ్‌ది సీరిస్, బెస్ట్ బ్యాట్స్‌మెన్, బౌలర్‌కు రూ.5వేలు చొప్పున ఇస్తారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అసమర్ధ పాలనలో యువత భవిష్యత్ ప్రశ్నార్ధకంగా మారిందని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, గుంటూరు



పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ అధ్యక్షులు దామర్ల రాజు, మంగళగిరి మండల అధ్యక్షులు తోట పార్ధసారధి, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు, దుగ్గిరాల మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, తదితరులు పాల్గొన్నారు.



జిల్లాస్థాయి టైక్వాండో పోటీలు

ప్రజాశక్తి మంగళగిరి

తైక్వాండో అసోసియేషన్ గుంటూరు జిల్లా వారి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు మంగళవారం మంగళగిరి వీటి జె యం డిగ్రీ కళాశాలలో జరిగాయి. సబ్ జూనియర్ విభాగంలో ధానిష్ హుస్సేన్ , ఉజ్వలా బంగారు పతకాలు సాధించగా, జ్ఞాన తేజస్వీ ,హతిహాసిని, భరద్వాజ్, నిహాల్, కేతన్, శ్రీనివాస్,లు సిల్వర్ మెడల్స్ సాధించారు. జూనియర్,పీవీ విభాగంలో వినోద్ పాల్ , అబ్దుల్ రెహమాన్, గీతికలు బంగారు పతకాలు సాధించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి నియోజకవర్గం వైఎస్ఆర్‌సిపి ఇంచార్జ గంజి చిరంజీవి, బీసీ సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఫౌండర్ కే స్వాతి, టిడిపి పట్టణ అధ్యక్షులు దామర్ల రాజు తదితరులు విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ టోర్నమెంట్లో బంగారు పతకాలు సాధించిన సబ్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ ఈనెల 20 ,21వ తేదీన నంద్యాల్లో జరగబోయే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటారని గుంటూరు జిల్లా సెక్రెటరీ పి.సుబ్బారావు తెలిపారు.



వర్సిటీలో రూ. 40 లక్షలతో అత్యుత్తమ తాగునీటి ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన మంచినీటి శుద్ధీకరణ ప్లాంటును మంగళవారం విసి ప్రొఫెసర్ పి. రాజశేఖర్ ప్రారంభించారు. సుమారు రూ.40 లక్షల రూసా నిధులతో ఈ ప్లాంట్ ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీసీ స్విచ్ ఆన్ చేసి ప్లాంట్ ను ప్రారంభించారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు వర్సిటీ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ప్లాంటును పరిశీలించిన ఆయనకు వివరాలను ఇంజనీర్ కుమార్ రాజా, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే .సుబ్బారావు, జేఈఈ అప్పారావులు ప్లాంట్ వివరాలను విసికి వివరించారు. ఐదు రకాల ఫిల్టరైజేషన్ తర్వాత తాగునీటి కి నీటిని పంపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ పి. వరప్రసాద్ మూర్తి , ఓ ఎస్ డి ప్రొఫెసర్ కే .సునీత, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బట్టు నాగరాజు, అంబేద్కర్ చైర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కే. అబ్రహం లింకన్, దూరవిద్య పరీక్షలు కోఆర్డినేటర్ డాక్టర్ సోమశేఖర్ బాలుర వసతి గహాల చీఫ్ వార్డెన్ ప్రొఫెసర్ నాగరాజు, అడిషనల్ వార్డెన్ బాల మురళి, ప్రొఫెసర్ ఆర్ రమేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

రాజధానిలో మట్టి అక్రమ తవ్వకాలు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని ప్రాంతంలో మట్టి, ఇసుక, కంకర, ఇనుము, గ్రావెల్ లాంటి నిర్మాణ సామాగ్రిని దొంగిలించడం పరిపాటిగా మారింది. ఏకంగా రోడ్లను తవ్వి కంకర, గ్రావెల్‌ను తరలించడం, చివరకు భారీ మంచి నీటి పైపులను సైతం కట్టర్‌లతో కోసి వాహనాలలో తరలించి సొమ్ము చేసుకోవడం, పోలీసులు కొంతమంది పై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయడం జరిగింది. గత ప్రభుత్వం హయంలో నిర్మాణ సంస్థలు నిల్వ చేసిన మెటీరియల్ తరచు చోరీకి గురవుతోంది. దీనిపై రైతులు ఆందోళన చెందుతున్నారు. రాజధాని ప్రాంతంలో మట్టి అక్రమ తరలింపు యధేచ్ఛగా జరుగుతోంది. అక్రమార్కులు జేసిబి ,టిప్పర్‌లను తెచ్చి దర్జాగా పొలాల్లో మట్టిని తవ్వి తరలించుకు పోతున్నారు. కొద్ది రోజులుగా రాజధాని ప్రాంతం వెంకటపాలెం పొలాల్లో మట్టి తవ్వకాలు



ఆందోళన వ్యక్తం చేస్తున్న వెంకటపాలెం రైతులు

జరుగుతున్నాయి. మంగళవారం తెల్లవారుజామున మట్టి తవ్వుతుండగా రైతులు అడ్డుకున్నారు. పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు మట్టి తవ్వుతున్న ప్రదేశానికి వచ్చి టిప్పర్, జెసిబిని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని రైతులు హెచ్చరించారు.



జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు రక్ష

ప్రజాశక్తి - చేబ్రోలు: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు రక్ష అని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారులు తెలిపారు. మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్ - 2 కార్యక్రమం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేజండ్లలో నిర్వహించారు. వేజండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ కొత్తపల్లి బాబురావు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వలన ప్రజలకు మరిన్ని వైద్య సేవలను అందించడం జరుగుతుందని, కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజలకు చేయదగిన వైద్య పరీక్షలు ఉచితంగా చేయడం జరుగుతుందని అన్నారు. గ్రామంలో నిర్వహించిన క్యాంపులో దాదాపుగా 500 మందికి అన్ని రకాల వైద్య పరీక్షల నిర్వహించటం, అవసరమైన సేవలను అందించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రక్షిత్ శార్దూల్, డాక్టర్ కృష్ణ ప్రియ, డాక్టర్ శ్రీకాంత్, గ్రామ సర్పంచ్ హైమావతి, ఉపసర్పంచ్ నాగిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి బి ప్రశాంతి పాల్గొన్నారు.

డీఎస్సీ క్వాలిఫైడ్ టీచర్స్‌కు న్యాయం చేయాలి

ప్రజాశక్తి మంగళగిరి

1998 డీఎస్సీ క్వాలిఫై అయ్యి మిగిలిపోయిన వారిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగులు, మైనార్టీలు 2000 మంది ఉన్నారని వారికి న్యాయం చేయాలని కోరుతూ మంగళగిరి నియోజకవర్గం వైఎస్ఆర్పిపి ఇన్చార్జ్ గంజి చిరంజీవిని, ఎమ్మెల్సీ మురుగుడు



హనుమంతరావు మంగళవారం సాయంత్రం మంగళగిరిలో జరిగిన ఎస్సీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం ఆ ఫైలు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దగ్గర ఉన్నదని విన్నవించారు. ఎన్నికల కోడ్ రాకముందే తమకు ఉద్యోగాలు వచ్చే విధంగా సీఎం జగన్మోహన్ రెడ్డి దష్టికి తీసుకువెళ్లి న్యాయం చేయాలని కోరారు. దీంతో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఇంచార్జ్ గంజి చిరంజీవి స్పందించి వారికి న్యాయం జరిగేల చేస్తామని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో క్వాలిఫైడ్ టీచర్స్ నెల్లూరుకు చెందిన బి శ్రీనివాసరావు, పులివెందులకు చెందిన పి రమేష్, గుంటూరుకు చెందిన ఎం విశ్వరూప పాల్గొన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారులు

ఎరువుల దుకాణంలో తనిఖీలు

ప్రజాశక్తి తెనాలి : ఎరువులు, పురుగుమందుల షాపులలో వ్యవసాయ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేశారు. పెదకాకాని మండల పరిధిలోని తక్కెళ్ళపాడు, ఉప్పలపాడు గ్రామాలలో మంగళగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు టి శ్రీనివాసరెడ్డి సారధ్యంలో ఎరువులు, పురుగు మందుల షాపులలో స్టాక్ రిజిస్టర్ లను, షాపుల లైసెన్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ ఎమ్మార్పీ కి మించి విక్రయాలను సహించబోమన్నారు. విక్రయాలకు సంబంధించి బిల్లులు విధిగా కొనుగోలుదారులకు ఇవ్వాలన్నారు. రైతులు అధీకత డీలర్ల వద్ద మాత్రమే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధి కారులు పి.సంధ్యారాణి సిబ్బంది పాల్గొన్నారు.

ఒన్‌టౌన్ సిఐగా దశరథరామయ్య

ప్రజాశక్తి - తెనాలి



పట్టణ వన్ టౌన్ సర్కిల్ ఇనస్పెక్టర్‌గా జి.దశరథ రామయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల గుంటూరు రేంజ్ ఐజి సర్కిల్ ఇనస్పెక్టర్ బదిలీపై జారీ చేసిన ఉత్తర్వుల మేరకు గుంటూరు విఆర్ నుంచి తెనాలి వన్ టౌన్ కు దశరథ రామయ్య బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన కె చంద్రశేఖర్ గుంటూరు విఆర్ కు వెళ్లిన సంగతి తెలిసిందే. బాధ్యతలు చేపట్టేందుకు వచ్చిన సీఐని ఎస్ఐలు, సిబ్బంది స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఏదైనా అసౌకర్యం కలిగితే పోలీసులను సంప్రదించాలని, తక్షణమే స్పందిస్తామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగితే సహించేది లేదన్నారు.

వికలాంగులకు వీల్‌చైర్లు

రోటరీక్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు పరుచూరి కిరణ్

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని తాడేపల్లి మండల వికలాంగులకు ఉచితంగా వీల్ చైర్స్ ఇవ్వనున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు పరుచూరి కిరణ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన వికలాంగులు ఆధార్ కార్డు, ఫోటోని జత చేసి, 7799857679 నెంబర్‌కి వాట్సాప్ చేయాలని ఆయన తెలిపారు. పూర్తి సమాచారం కొరకు జనవరి 15 లోపు,రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి కార్యదర్శి చంద్ర ఓబులారెడ్డి నీ సంప్రదించాలని ఆయన తెలిపారు.



సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ అయోధ్యరామిరెడ్డి తదితరులు

ఘనంగా మాజీ మంత్రి సత్యనారాయణ వర్ధంతి

ప్రజాశక్తి తెనాలి : మాజీ మంత్రి అన్నాబత్తుని సత్యనారాయణ వర్ధంతిని ఆయన తనయుడు, ఎమ్మెల్యే అన్నా బత్తుని శివకుమార్ నేతత్వంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రకాశం రోడ్డులోని ఏ ఎస్ ఎన్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యనారాయణ అంచలంచెలుగా రాజకీయాల్లో ఎదిగారని, సామాజిక సేవా దృక్పథంతో విద్యాసంస్థలను నెలకొల్పారని కొనియాడారు. తండ్రి స్ఫూర్తితో ఆయన ఆశయాలను శివకుమార్ ముందుకు తీసుకువెళ్తున్నారని అన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున మాట్లాడుతూ తెనాలి అభివృద్ధిలో సత్యనారాయణ చెరగని ముద్ర వేశారన్నారు. తొలుత శివ కుమార్ తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు సత్యనారాయణ సమాధి వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక, మాజీ చైర్పర్సన్ సయ్యద్ కాలేదా నశీం, కమిషనర్ ఎం జస్వంత్ రావు, తహసిల్దార్ కె రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మహాసభలో తాటికోల పద్మావతికి ప్రశంసాపత్రం

ప్రజాశక్తి - గుంటూరు : రెండవ అంతర్జాతీయ తెలుగు మహాసభలో కవితాగానం, కథా పఠనంలో చేసిన రచయిత తాటికోట పద్మావతికి ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రచయిత పింగళి భాగ్యలక్ష్మి మంగళవారం గుంటూరులో వివరాలు తెలిపారు. జనవరి 5,6,7 తేదీల్లో రాజమహేంద్రవరంలో ఆంధ్రసారస్వత మరియు చైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో రెండవ అంతర్జాతీయ మహాసభ నిర్వహించారని తెలిపారు. వేలాదిగా విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఈ సభలో పాల్గొని ప్రశంశాపత్రం అందుకున్న తాటికోల పద్మావతికి గుంటూరు జిల్లా రచయితల సంఘం, సాహితీ మిత్రలు అ బి న ం ద న ల ం తెలియజేశారని భాగ్యలక్ష్మి తెలిపారు.



ఆర్‌విఆర్ అధ్యాపకుడు కృష్ణచైతన్యకు డాక్టరేట్



ప్రజాశక్తి-గుంటూరు

ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.కృష్ణచైతన్యకు అన్నామలై యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. కృష్ణచైతన్య 'అసెస్మెంట్ ఆఫ్ సెల్ఫ్ కాంపాక్టింగ్ కాంక్రీట్ ప్రాపర్టీస్ యూజింగ్ వేస్ట్ కాపర్ స్లాగ్ యాజ్ ఫైన్ యాగ్రిగేట్: యాన్ ఎక్స్‌పరమెంటర్ స్టడీ ' అనే అంశంపై డాక్టర్ ఇలాంగో శివకుమార్ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. దీంతో తమ కళాశాలలో పిహెచ్‌డి కలిగిన సిబ్బంది 138 మంది ఉన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తెలిపారు. కృష్ణచైతన్యకు కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తదితరులు అభినందనలు తెలిపారు.

విజ్ఞాన్స్ విద్యార్థికి పీహెచ్‌డీ



ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ ఈసీఈ విభాగం విద్యార్థి అంబవరం ప్రతాప్‌రెడ్డికి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. ప్రతాప్‌రెడ్డి ' ఇన్వెస్టిగేషన్ ఆన్ బాండ "విడ్త్ అండ్ గేన్ ఎన్‌హ్యాన్స్‌మెంట్ ఆఫ్ మైక్రోస్ట్రిప్ ప్యాచ్ యాంటినా ఫర్ వైమ్యాక్స్-5జీ డబ్ల్యూలాన్ అప్లికేషన్స్' అనే అంశంపై ఆయన పరిశోధన చేశాడని, ఈయనకు విజ్ఞాన్స్ యూనివర్సిటీ ఈసీఈ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎమ్.పచియానన్ గైడ్‌గా వ్యవహరించారన్నారు. ప్రతాప్‌రెడ్డికి వర్సిటీ వీసీ పీ.నాగభూషణ్ అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

మలినేనిలో ముగిసిన హ్యాకథాన్

ప్రజాశక్తి-గుంటూరు



విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఉష రంగరాజన్

పుల్లడి గుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీపై నిర్వహించిన 36 గంటల హ్యాకథాన్ మంగళవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా ప్రముఖ డేటా సైంటిస్ట్, ప్రపంచ స్థాయి ట్రిపుల్ కాగిల్ గ్రాండ్ మాస్టర్ ఉష రంగరాజన్ వ్యవహరించారు. 100 విద్యార్థులు వివిధ విభాగాలలో ఉన్న 25 సమస్యలకు ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ ద్వారా పరిష్కార నమూనాలు కనుగొన్నారు. ఉత్తమ నమూనాలకి రూ.10వేలు నగదు బహుమతి అందచేశారు. ఈ సందర్భంగా ఉషా రంగరాజన్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు అధిక ప్రాధాన్యత ఉంటుందని, విద్యార్థులు టెక్నాలజీలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పును ఎప్పటికీ అప్పుడు గమనిస్తూ అప్డేట్ అవ్వాలని అన్నారు. అకడెమిక్స్‌తో పాటు సమస్య పరిష్కార నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే ప్రస్తుత ఆర్థిక మాంద్యం పరిస్థితుల్లో కూడా మంచి అవకాశాలు పొందవచ్చు అని అన్నారు. ఈ హ్యాకథాన్ కార్యక్రమాన్ని మిరాకల్ సాఫ్ట్‌వేర్ సిస్టం ప్రాక్టీస్ మేనేజర్ మధు వడ్లమాని పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు, ప్రిన్సిపాల్ డాక్టర్ జెట్టి అప్పారావు, డైరెక్టర్ డాక్టర్ దేవిరెడ్డి శ్రీనివాసకుమార్, డీన్ అడ్మిషన్స్ డాక్టర్ పోపూరి రమేష్‌బాబు, డీన్ అకడమిక్స్ ప్రొఫెసర్ జంపాని కిషోర్‌బాబు, ఈసిఈ విభాగాధిపతి డాక్టర్ డి.విజయ సారథి పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తదితరులు

ఫిబ్రవరి 17, 18 తేదీల్లో బాలోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

పిల్లల్లో విద్యతోపాటు, వారి అభిరుచులను, ఆసక్తులను, సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు ఫిబ్రవరి 17, 18 తేదీల్లో గుంటూరు నగరంలోని హిందూ కాలేజిలో 'గుంటూరు జిల్లా బాలోత్సవం' నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ, బాలోత్సవం అధ్యక్షులు కెఎస్ లక్ష్మణరావు తెలిపారు. మంగళవారం స్థానిక బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో బాలోత్సవం పోస్టర్లు ఆవిష్కరించారు. తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులను బాలోత్సవంలో పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరారు. బాలోత్సవం కన్వీనర్లు యం.బోసుబాబు, కెవిఎస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ 25 రకాల అంశాలపై జూనియర్, సీనియర్ విభాగాలలో పోటీలు ఉంటాయన్నారు. బాలోత్సవం ప్రధాన కార్యదర్శి బి.ప్రసాద్ మాట్లాడుతూ పూర్తి వివరాలు అన్ని పాఠశాలలకూ పంపిస్తామని, పాల్గొన్న ప్రతి విద్యార్థికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ఇస్తామని, గెలుపొందిన వారికి బహుమతులు ఉంటాయని చెప్పారు. అలాగే పాఠశాల ఓవరాల్ చాంపియన్‌షిప్ కూడా ఉంటుందన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో చావా శ్రీనివాసరావు, టి.జాన్‌బాబు, జి.వెంకటరావు, పి.వి.మల్లేశ్వర్, వెంకటరెడ్డి, కె.శ్రీదేవి, ఎస్.ఎం.సుబాని, యం.ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

నిరసనపై నిర్బంధం

ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు హౌస్ అరెస్టు - యుటిఎఫ్ నాయకులకు నోటీసులు



ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు గృహ నిర్బంధం

ప్రజాశక్తి-గుంటూరు

బకాయిలు చెల్లించాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడలో మంగళ, బుధవారాల్లో 36 గంటల ధర్నా తలపెట్టిన నేపధ్యంలో యుటిఎఫ్ నేతలపై ప్రభుత్వం నిర్భంధం ప్రయోగించింది. జిల్లాలో పలు చోట్ల యుటిఎఫ్ నాయకులకు ఇళ్లకు వెళ్లి పోలీసులు నోటీసులు ఇచ్చారు. విజయవాడ అందోళనకు వెళ్లకుండా శ్యామలానగర్‌లో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావును సోమవారం అర్ధరాత్రి నుండే గుంటూరు పోలీసులు గృహ నిర్భంధం చేశారు. మంగళగిరి నాయకులు ఏడుకొండలు, జిల్లా నాయకులు ధనలక్ష్మి, జిల్లా నాయకులు ప్రేమ్‌కుమార్, తాడికొండ నాయకులు జె.శ్రీనివాసరావు తదితరులకు నోటీసులు ఇచ్చారు. విజయవాడ వెళ్లిన జిల్లా నాయకుల్ని, ఉపాధ్యాయుల్ని పోలీసులు అరెస్ట్ చేసి, వివిధ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతు విజయవాడలోని జిల్లా నాయకులను, కార్యకర్తలను నిరసన దీక్షలకు అనుమతి ఇవ్వకుండా అక్రమంగా అరెస్టు చేయడాన్ని పిడిఎఫ్ తరపున ఖండిస్తున్నామని ఎమ్మెల్సీ లక్ష్మణరావు తెలిపారు. ఆందోళనకు వెళ్లిన వారిని అరెస్ట్‌లు చేయటం నియంతృత్వ పాలనకు నిదర్శనమని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, యం.కళాధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఎన్ని నిర్భంధాలు ప్రయోగించినా జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో విజయవాడ వెళ్లి నిరసన తెలిపారన్నారు. నిర్బందంతో ఉద్యమాలను అపలేరని, ఇప్పటికైనా ఉపాధ్యాయుల డిమాండ్లు నెరవేర్చాలన్నారు.



ప్రేమ్‌కుమార్‌కు నోటీసులు



ధనలక్ష్మికి నోటీసులు ఇచ్చిన పోలీసులు



సమావేశంలో మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్‌ఒ డాక్టర్ విజయలక్ష్మి

జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ప్రోగ్రామ్ ఆఫీసర్లతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి మంగళవారం డిఎంఅండ్‌హెచ్‌ఒ ఛాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని 31 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 47 పట్టణ ఆరోగ్య కేంద్రాలను, ప్రోగ్రాం ఆఫీసర్ల వారీగా విభజించి, వారి ఏరియాలలో అన్ని రకాల ఆరోగ్య కార్యక్రమాలను పర్యవేక్షించి, అన్ని కార్యక్రమాలలో లక్ష్యాలను సాధించి, జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలని అన్నారు. ముఖ్యంగా జగనన్న అరోగ్య సురక్ష 2వ దశలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలను విజయవంతం చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ కార్డులను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డి.శ్రీనివాసులు, ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ ఎ.శ్రావణబాబు, డిపిఎంఒ డాక్టర్ రత్న మన్మోహన్, డిఐఒ డాక్టర్ కె.వి.సుబ్బరాజు, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ ఈ.అన్నపూర్ణ, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయన్, డెమో ఎ.జయప్రసాద్, డిప్యూటీ డెమో ఎన్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న మేయర్

జిఎంసి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 14, 15 తేదీలలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు తెలిపారు. మంగళవారం మేయర్ సంక్రాంతి సంబరాల ఏర్పాట్లకు సంబంధించి ఎన్‌టిఆర్ స్టేడియంను పరిశీలించి, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, గతేడాది జిఎంసి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయన్నారు. ఈ ఏడాది కూడా సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించనున్నామని చెప్పారు. సంబరాలలో భోగి పళ్ళు, భోగి మంటలు, గంగిరెద్దుల విన్యాసాలు, రంగవల్లులతో పాటు వివిధ సంస్కృతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్నందున జిఎంసి అధికారులు సమన్వయంతో ఎటువంటి లోపాలు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ బి.శ్రీనివాసరావు, యస్.ఈ సుందర్రామిరెడ్డి, డి.ఈ.ఈ. మహ్మద్ రఫిక్, ప్రజారోగ్య, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

సింధుకు కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి-తాడేపల్లి :అనారోగ్యంతో మృతిచెందిన అన్నపురెడ్డి సింధు (36) అంత్యక్రియలు కన్నీటి వీడ్కోలు మధ్య మంగళవారం తాడేపల్లిలో జరిగాయి. సింధు తండ్రి అన్నపురెడ్డి కోటిరెడ్డి సిపిఎంలో క్రియాశీలకంగా పని చేస్తున్నారు. అనేక మంది సిపిఎం రాష్ట్ర నాయకులతో సహా జిల్లా, స్థానిక నాయకులు సింధు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. పిన్న వయసు లోనే కుమార్తెను కోల్పోయిన కోటిరెడ్డిని సిపిఎం నాయకులు ఓదార్చారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సింధు అంతిమయాత్ర కొత్తూరులోని ఆమె స్వగృహం నుండి అమరారెడ్డినగర్ పక్కన గల హిందూ శ్మశాన వాటిక వరకు సాగింది. అనంతరం అక్కడ అంత్యక్రియలు నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు డి రమాదేవి, సిహెచ్ బాబురావు, వి ఉమా మహేశ్వరరావు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, కార్యదర్శివర్గ సభ్యులు వై నేతాజీ, కె నళినీకాంత్, ఈమని అప్పారావు, ఎం రవి, ఎన్ భావన్నారాయణ, ఎంబి విజ్ఞాన కేంద్రం కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ, బాధ్యులు పి.విజయ, సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే పుతుంబాక భారతి, సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, జెవి రాఘవులు, సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు కె అనురాధ, ఐద్వా రాష్ట్ర, జిల్లా నాయకులు డి శ్రీనివాసకుమారి, కె పద్మ, జి రమణ, నాయకులు డి వెంకటరెడ్డి, కాకుమాను నాగేశ్వరరావు, దండా లక్ష్మీనారాయణ, ఎం పకీరయ్య, గాదే సుబ్బారెడ్డి, వి భారతి, కృష్ణకాంత్, ఎం శ్రీనివాసరెడ్డి, డి వి భాస్కరరెడ్డి, దశరథరామిరెడ్డి, గోపిరెడ్డి పలు ప్రజాసంఘాల నాయకులు సింధు భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.



సింధు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు





సింధు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న సిహెచ్ బాబురావు, డి రమాదేవి



నివాళులర్పిస్తున్న వి కృష్ణయ్య, జొన్నా తదితరులు



వి శ్రీనివాసరావు, పాశం రామారావు, ఎం రవి నివాళి



సిపిఎం నేత పి.మధు నివాళి